క్లుప్తంగా

'కేంద్రం ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తోంది'



రామారెడ్డి : ఉపాధి హామీ పనిని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు డి సరిచంద్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం సదాశివనగర్ మండలంలోని వజ్జేపల్లి తండా ఉపాధి హామీ కూలీల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి సరిచంద్ సహకార్యదర్శి సచిన్, నవీన్ ప్రవీణ్ రాజేశ్ పాల్గొన్నారు.

సురేశ్ షెట్కార్ నామినేషన్‌కు తరలిన నాయకులు



పిట్లం(జుక్కల్): జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్ నామినేషన్‌కు పిట్లం మండలం నుండి బుధవారం ప్రైవేట్ వాహనాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. వెళ్లినవారిలో మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్, మండల కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివ తదితరులున్నారు.

నస్రుల్లాబాద్ నుంచి..

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి సురేశ్‌షెట్కార్ నామినేషన్‌కు నస్రుల్లాబాద్ మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు తరలివెళ్లారు. సంగారెడ్డిలో నామినేషన్ వేసిన సురేశ్ షెట్కార్‌కు మద్దతుగా కాంగ్రెస్ నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా దుర్కి సహకార సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, నందురెడ్డి, కిషోర్‌యాదవ్, నారాగౌడ్, సాయాగౌడ్, అరిగే సాయిలు ఉన్నారు.

బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా రాజశేఖర్‌రెడ్డి



భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన పైడి రాజశేఖర్‌రెడ్డిని బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార నియామకపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషిచేయడంతో పాటు ఇంటింటా తిరిగి ప్రధాని చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తానన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లం క్యాంపుతండా పంచాయతీ పరిధిలోని పలువురు యువకులు బుధవారం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండల లక్ష్మీనారాయణ కండువాలు కప్పారు. చేరిన వారిలో గుడుగుట్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సాయిబాబ, తాడ్కోల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



కామారెడ్డి అర్బన్ : సమాచార హక్కు చట్టంపై ప్రజలను చైతన్యం చేయడం ద్వారా ఆర్టీఐ కార్యకర్తలు గొప్ప సమాజసేవ చేస్తున్నారని కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. చైర్ పర్సన్ ఇందుప్రియ బుధవారం సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సహ చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం, ప్రతినిధులు ప్రదీప్‌కుమార్, శివపూజ లింబయ్య తదితరులున్నారు.

జాతీయ సదస్సు పోస్టర్లు..

బిచ్కుంద(జుక్కల్) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సదస్సు కార్యక్రమం పోస్టర్లను ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ ఆవిష్కరించారు. వచ్చేనెల 9, 10 తేదీల్లో జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ 2020)అనే అంశంపై రెండు రోజులు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల ప్రముఖులు, విద్యావేత్తలు, వక్తలు వస్తున్నారన్నారు. ఆసక్తిగల వారు 9701155512లో ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ప్రైవేట్ కళాశాలలదే హవా..

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రైవేట్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీలో రచన, భవాని, అమూల్య 467 మార్కులు, జైపాల్, నేహా 466 మార్కులు, బైపీసీలో మహమ్మద్ బిలాల్, సర్వతా ఫాతిమా 435 మార్కులు, ఫాతిమా జుహేరా, సాయి రిశ్వతారెడ్డి 434 మార్కులు, సీఈసీలో ఫర్హానా బేగం 486, అక్షతరెడ్డి 483, దివాకర్ 481 మార్కులు సాధించారు.

ఎంఈసీలో ప్రత్యూష 433 మార్కులు సాధించారు. అలాగే సెకండియర్‌లో ఎంపీసీలో పి. చందన 991, సుప్రితాగౌడ్ 985, బైపీసీలో అఖిలా 990, లావణ్య 978, సీఈసీలో శ్రీరీన్ బేగం 969, అజయ్‌కుమార్ 959, ఎంఈసీలో దిశా జైన్ 955 మార్కులను సాధించారు.



ఎస్‌ఆర్‌కే విద్యార్థులను అభినందిస్తున్న ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం

ఎస్‌ఆర్‌కే జూనియర్ కళాశాల విద్యార్థులు ఫస్టియర్‌లో నందిని 466, బైపీసీలో పూజిత 432, సెకండియర్‌లో ఎస్. స్నేహా 979 మార్కులను సాధించారు. విద్యార్థులను జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం అభినందించారు. విద్యార్థులను కళాశాల యజమాన్యం సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దత్తాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అమూల్య (467)



ఫాతిమ(435)



ప్రత్యూష(433)



సుప్రితాగౌడ్(985)



లావణ్య(978)



బోహ్రాజైన్(955)

బాన్సువాడలో..

బాన్సువాడ : బాన్సువాడలోని ప్రైవేటు కళాశాలల ప్రభంజనం సృష్టించాయి. స్థానిక భారత రత్న కళాశాలలో సెకండియర్ బైపీసీలో ఉమ్మెహని(979) మార్కులు సాధించి డివిజన్ టాపర్‌గా నిలిచింది. ఫస్టియర్ ఎంపీసీలో స్నేహిత్ (452) మార్కులు సాధించి డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ తెలిపారు. ఠాగూర్ జూనియర్ కళాశాలకు చెందిన జోయా ముస్కాద్ సెకండియర్ బైపీసీలో (978) మార్కులు సాధించిన డివిజన్ ద్వితీయ స్థానంలో నిలిచారు. సెకండియర్ సీఈసీలో మానసకు (929) మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ మైశయ్య తెలిపారు. రేణుక వోకేషనల్ కళాశాలలో ఎంఎల్‌టీ ఫస్టియర్‌లో సాయిప్రసాద్‌కు (489), సౌజన్యకు ఎంఎల్‌టీలో (486) మార్కులు సాధించారు. సెకండియర్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూలో జ్యోతికి (974), ఎంపీహెచ్‌డబ్ల్యూలో గంగోత్రికి (971) మార్కులు వచ్చినట్లు ప్రిన్సిపల్ వెల్లుట్ల మహేందర్ తెలిపారు.



ఉమ్మెహని(979)



ముస్కాద్(978)



మానస(929)

సత్తాచాటిన కేజీబీవీ విద్యార్థులు

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల ఇంటర్ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ చూపారు. ఫస్టియర్ సీఈసీలో అమృత 446 మార్కులు, ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో శ్రీలత 466 మార్కులు సాధించి కేజీబీవీ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే సెకండ్ ఇయర్ సీఈసీలో అనిత 849 మార్కులు, ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో లక్ష్మి 976 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో సత్తాచాటారు. సెకండ్ ఇయర్‌లో 91 శాతం, ఫస్టియర్‌లో 71 శాతం ఉత్తీర్ణ సాధించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ 33 శాతం, సెకండ్ ఇయర్‌లో 26 శాతం ఉత్తీర్ణత సాధించారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఫస్టియర్‌లో 75మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 39మంది విద్యార్థులు పాసయ్యారు. సెకండ్ ఇయర్‌లో 64 మంది విద్యార్థులకు గాను 28మంది ఉత్తీర్ణులయ్యారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ లో 16శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో 134 మందికి ఒక్కరు పాస్ కాగా సెకండియర్‌లో 134మందికి 16మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ బుద్ధిరాజ్ తెలిపారు.

'ఆంగ్ల భాషతో గుర్తింపు'



కామారెడ్డి అర్బన్ : విద్యార్థులు ఆంగ్ల భాషను సులభంగా నేర్చుకుని అనర్గళంగా మాట్లాడినప్పుడే పోటీ ప్రపంచాన్ని తట్టుకుని నిలబడగలరని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కూకట్ల విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం కళాశాలలో అంతర్జాతీయ ఆంగ్ల భాష దినోత్సవం నిర్వహించారు. విశ్రాంత ఆంగ్ల ప్రొఫెసర్ నరసింహం ఇంగ్లీష్ మాధుర్యాన్ని సూక్తులతో వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య, ఆంగ్ల విభాగం ఇంచార్జి ఫర్హీన్ ఫాతిమా, అధ్యాపకులు సత్యనారాయణ తదితరులున్నారు.

మద్నూర్‌లో తగ్గిన ఉత్తీర్ణత

మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని రాంసుఖ్ బాల్‌ముకుంద్ ఇనాని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్ష ఫలితాలు పూర్తిగా పడిపోవడంతో పలువురు మండిపడుతున్నారు. బుధవారం ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదల కావడంతో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 9.57 శాతం, సెకెండ్ ఇయర్‌లో 19.8 శాతం ఉత్తీర్ణత సాదించారని కళాశాల ప్రిన్స్‌పాల్ హయగ్రీవ్ తెలిపారు. ఫస్ట్ ఇయర్‌లో మొత్తం 94 మంది విద్యార్థులు పరీక్ష రాయగా కేవలం 9 మంది పాసయ్యారు. సెకెండ్ ఇయర్‌లో మొత్తం 101 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా కేవలం 20 మంది పాసయ్యారని ఆయన తెలిపారు. అలాగే ఎంపీసీలో ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణత సాధించలేదని కళాశాల సిబ్బంది తెలిపారు. ఫస్ట్ ఇయర్ బైపీసీలో గంగోత్రి 324, మౌనిక 300, సీఈసీలో గాయత్రి 349, రోహిత్ 338 అత్యధికంగా మార్కులు వచ్చాయి. సెకెండ్ ఇయర్ బైపీసీలో మల్లిక 895, సుజాత 843, సీఈసీలో పందరి 760, నాందేవ్‌కు 733 అత్యధిక మార్కులు వచ్చాయని వారు తెలిపారు.

ఉత్తీర్ణత సాధించింది పదిమందే..

రామారెడ్డి : ఇంటర్ ఫలితాల్లో రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిరాశపర్చారు. గతంలో ఉత్తమ ఫలితాలు సాధించిన రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఈసారి ఫలితాల్లో వెనుకబడారు. ఇంటర్ ఫస్టియర్‌లో అన్ని గ్రూపుల్లో కలిపి 95 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా ఉత్తీర్ణులైంది అయిదుగురే. సెకండియర్ లోనూ 101 మంది పరీక్షలకు హాజరు కాగా ఐదుగురు విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

మళ్లీ మోదీనే ప్రధాని

బాన్సువాడ : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, హ్యాట్రిక్ ప్రధాని మోదీయేనని మాజీ అసెంబ్లీ కన్వీనర్ చీదరి సాయిలు అన్నారు. బుధవారం బాన్సువాడలో బీజేపీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బిబి. పాటిల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ప్రచారంలో బీజేపీ నాయకులు కొండని గంగారం, తోట శంకర్ తదితరులున్నారు.

నిజాంసాగర్(జుక్కల్): పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బుధవారం మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంప్రసాద్ గుప్తా, రాజాగౌడ్ ఉన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పాఠశాల కమిటీలు సక్రమంగా పనిచేయాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : అమ్మ ఆదర్శపాఠశాల కమిటీల సభ్యులు సక్రమంగా పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి వీరనందు అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ ఆఫీస్‌లో బుధవారం మండల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం పథకాలు ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. అనంతరం ఐకేపీ ఏపీఎం రవీందర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న అర్హులైన సంఘాలకు రుణాలు ఇప్పించి, ఆ సంఘాలు మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న శ్రీనిధి, బ్యాంకు లింకేజి రుణాలు సక్రమంగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతినెల 10వ తేదీలోపు చెల్లించిన సంఘాలకు మాత్రమే పావులా వడ్డి వర్తిస్తుందన్నారు. ఈ సందర్భంగా జీవనోపాదుల కల్పన, ఆర్థిక చేయూత, ఇన్స్‌రెన్స్, ఉపాదికల్పనలు, ప్రభుత్వ పథకాలు, వడ్డీరాయితీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు యశోద, ఏపీయం రవీందర్, తహసిల్దార్ రహీమొద్దీన్, ఎంపీడీవో సాజిద్ అలీ, సీసీలు, వివిధ గ్రామాల అధ్యక్షురాలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వీరనందు

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

కామారెడ్డి అర్బన్ : ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేస్తూ ఆటో యూనియన్స్ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు బుధవారం కామారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. మహాలక్ష్మి పథకంతో తమ బతుకులు వీధిన పడ్డాయని, తమకు ప్రతినెల 12వేల ఆర్థిక సహాయం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. పది డిమాండ్లతో కూడిన వినతి పత్రం వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నర్సింలు, షేక్ హమ్మద్, అనిల్ తదితరులున్నారు.

నస్రుల్లాబాద్‌లో..

నస్రుల్లాబాద్ (బాన్సువాడ): ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఆటోడ్రైవర్లు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు వోట్లం దస్తాగౌడ్ మాట్లాడుతూ మండలంలో 150 మంది ఆటో డ్రైవర్లు ఆటోలు నడుపుతు జీవనం సాగిస్తున్నార న్నారు. పదిడిమాండ్లతో కూడిన వినతపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు జబ్బర్‌ఖాన్, నారాగౌడ్, చాకలి మనోహర్, సత్తర్ తదితరులున్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఆటో జేఏసీ నాయకులు

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వర కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



ఆలయంలో అన్నదానం

భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్‌లో అతిపురాతనమైన లక్ష్మీవేంకటేశ్వరాలయం జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని మూడు రోజులుగా ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో వేంకటేశ్వరస్వామి కల్యాణంను లక్ష్మిదేవి (శ్రీదేవి) భూదేవితో ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారీ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శిఖర ప్రతిష్ఠాపణ శిఖర అభిషేకం, హన్మాన్, గరుడ్మంతుడి విగ్రహల ప్రతిష్ఠాపన కార్యక్రమంలను నిర్వహించారు. భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన డాక్టర్ గజవాడ అరవింద్, అరిహంత్ అన్నదానం చేశారు. హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ తాటిపల్లి సిద్ధరాములు, ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ చైర్మన్ వంగేటి చిన్న నర్సారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిదులు పైడి సాయిరెడ్డి, హరిశ్చంద్రరెడ్డి, ఏనుగు బాల్‌రాజురెడ్డి, కుంట లింగారెడ్డి ఉన్నారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష

రాజంపేట : రాజంపేట మండల కేంద్రంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రాజంపేట మండలంలో 24 పోలింగ్ స్టేషన్లలో మొత్తం ఓటర్లు పురుషులు 10,584, స్త్రీలు 11,444 ఉన్నారన్నారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఎన్నికల నియమావళి పాటిస్తూ ప్రతి ఒక్కరికి ఓటరు స్లిప్పుల పంపిణీ చేయాలని సూచించారు.

ఆధ్యాత్మికం

వైభవంగా రాజగోపుర శిఖర ప్రతిష్ఠాపన



దోమకొండ : మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయ రాజగోపుర శిఖర స్థిర యంత్ర ప్రతిష్ఠాపన బుధవారం ఘనంగా నిర్వహించారు. మూర్తిన్యాసం, కలాన్యాసం, ప్రాణప్రతిష్ఠ, ఆలయశుద్ధి చేశారు. అనంతరం మధ్యాహ్నం మహ పూర్ణాహుతి, విశేష నీరాజనం, భక్తులకు అన్నదానం చేశారు. గురువారం రాజగోపున శిఖరానికి కలశ మహ కుంభాభిషేకం నిర్వహిస్తామని ఆలయ ప్రధానార్చకులు భావి కృష్ణమూర్తిశర్మ తెలిపారు. అదేవిధంగా శుక్రవారం సత్యనారాయణ వ్రతాలు ఉంటాయన్నారు. శనివారం సంకష్ట మహ గణపతి 8వ వార్షికోత్సవం, అన్నదానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త సుభాష్‌రెడ్డి, జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారద, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, రైతుబంధు మాజీ మండల అధ్యక్షుడు రావులపల్లి నర్సారెడ్డి తదితరులున్నారు.

రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు



రామారెడ్డి : రామారెడ్డి మండల కేంద్రంలో సీతారామచంద్రస్వామి శ్రీ రాజరాజేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈనెల 9 నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం శ్రీ సీతారామచంద్రస్వామి శ్రీ రాజరాజేశ్వర స్వామికి రామారెడ్డిలో రథోత్సవం ఊరేగింపు నిర్వహించారు. రథోత్సవానికి భక్తజనం భారీగా తరలివచ్చారు. రథాలను ఊరేగించిన అనంతరం ఉత్సవ విగ్రహాలను ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

బాన్సువాడ : బాన్సువాడలో జరిగే బేతాళస్వామి వేడుకల ఏర్పాట్లను బుధవారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ పరిశీలించారు. గురువారం నుంచి ప్రారంభం కానున్న జాతర వేడుకలకు మున్సిపల్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. నేడు ఎడ్ల బండ్ల ప్రదర్శన, శుక్రవారం కుస్తీ పోటీలు, శనివారం జాతర ముగింపు వేడుకలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ తెలిపారు. డివిజన్‌లో అతిపెద్ద జాతరగా బాన్సువాడ బేతాళస్వామి జాతరకు పేరు వచ్చిందని, తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కుస్తీయోధులు తరలివస్తారని అన్నారు. కౌన్సిలర్ నర్సగొండ, కాలనీ వాసులు మల్లికార్జున్, కసుకుట్ల రాజు తదితరులు ఉన్నారు.



సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం శాబ్దిపూర్ ఎడమ తండాలో జగదాంబ మాత, సంత్ సేవాలాల్ మహారాజ్, శ్రీ రాంరావ్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అన్నదాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మేగవత్ సేవ్యా, తండా నాయక్, మాలోత్ గోప్యానాయక్, తండా కారోబారి బానోత్ గంగారాం, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ రాజు, ఆలయ కమిటీ కోశాధికారి భూక్య రవి, ఆలయ కమిటీ సెక్రటరీ మానోత్ స్వామి తదితరులున్నారు.

బీరప్ప కామరాతి విగ్రహాల ఊరేగింపు



భిక్కనూరు : మండల కేంద్రంలోని బీరప్ప ఆలయంలో ప్రతిష్ఠించే బీరప్ప కామరాతి విగ్రహాలను మండల కేంద్రంలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ఊరేగించారు. డప్పు వాయిద్యాలతో విగ్రహాలను మండల కేంద్రంలోని ప్రధాన వీదుల గుండా ఊరేగించి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమ కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

'ప్రతి ప్రాణిలో భగవంతుడు ఉంటాడు'



లింగంపేట(ఎల్లారెడ్డి): పొల్కంపేట గ్రామంలో మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం నిర్వహించారు. రంగంపేట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన ప్రవచిస్తూ ప్రతీ ప్రాణిలో భగవంతుడు ఉన్నాడని, ప్రతీ ఒక్కరూ మంచి మార్గంలో నడవాలన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో వేదపండితులు రాజశేఖరశర్మ, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

చుక్కాపూర్‌లో నృసింహ హోమం



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో ఉన్న లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో బుధవారం స్వాతి నక్షత్రం సందర్భంగా నసింహ హోమాన్ని నిర్వహించారు. హోమంలో ఆరు జంటలు పాల్గొన్నాయి. మహిళలు హారతులు సమర్పించారు.అనంతరం తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి,ఈవో శ్రీధర్ రావు,సిబ్బంది సంతోష్ కుమార్,గ్రామస్తులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం



బాన్సువాడ రూరల్ : మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు ఆంజనేయస్వామీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. మాజీ ఎంపీపీ భూనేకర్ ప్రకాష్, ఎంపీటీసీ వెంకటరమణ, గ్రామస్తులు సాయాగౌడ్, శ్రావణ్, కోటి తదితరులున్నారు.

సంక్షిప్తం

గర్గుల్‌లో తాగునీటి ఎద్దడి



కామారెడ్డి రూరల్ : మండలంలోని గర్గుల్‌లో 4వ వార్డు పరిధిలోని ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలో తాగునీరు, బోర్లు పుష్కలంగా ఉన్నప్పటికి అధికారుల నిర్లక్ష్యంతో చెడిపోయిన బోర్లకు మరమ్మత్తులు చేయించకపోవడంతో తాగునీటి ఎద్దడి నెలకొంటుందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శికి, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ల ఇమ్రాన్ మోహియుద్దీన్(లడ్డూ) బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి బుధవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. జహీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, నాయకులు చంద్రశేకర్‌రెడ్డి, గోనే శ్రీనివాస్, పంపరి శ్రీను, వంశీ తదితరులున్నారు.



గ్రామాల్లో కాంగ్రెస్ ప్రచారం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : రాబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రె పార్టీ నాయకులు కోరారు. తాడ్వాయి మండల కేంద్రంతో పాటు చందాపూర్, సంగోజీవాడి, సంతాయిపేట్, ఎండ్రియాల్, చిట్యాల, బ్రహ్మజివాడి, కరడ్పల్లి తదితర గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. నాయకులు శివాజీ, సంజీవులు, లింగం, ప్రశాంత్, ఆసిఫ్, మహబూబ్, నాగరాజు, శాబొద్దీన్, రాజు, ప్రకాష్, భరత్ పాల్గొన్నారు.

విద్యాదాతకు సన్మానం



భిక్కనూరు : మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో విద్యాదాత తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డిని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ సుభాష్‌రెడ్డి నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తున్నాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.